క్లుప్తంగా

బల్దియా కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



కామారెడ్డి టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బల్దియా కార్మికుడు లింగం కుటుంబానికి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. కార్మికులంతా కలిసి జమ చేసిన రూ. 28,400 లను మున్సిపల్ డీఈ హన్మంత్ రావు చేతుల మీదుగా కుటుంబానికి అందజేశారు. ఏఈ శంకర్‌రావు, కార్మిక సంఘ నాయకులు లక్ష్మణ్, నర్సింగ్‌రావు, రాజనర్సు, ప్రభాకర్, ప్రభు తదితరులున్నారు.

రేషన్ షాపు తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రేషన్ షాపును గురువారం సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు తనిఖీ చేశారు. రేషన్‌షాపులో బియ్యాన్ని పరిశీలించారు. రేషన్ డీలర్లే కామారెడ్డిలో ఉన్న గోదాంలకు వచ్చి బియ్యాన్ని పరిశీలించి చూసిన తర్వాతే బియ్యాన్ని తమ గ్రామాలకు తీసుకెళ్లాలని సూచించారు. రేషన్ షాపులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. బియ్యం శాంపిల్స్ తీసుకెళ్లారు. క్వాలిటీ కంట్రోలర్ అధికారి అప్పారావు, సివిల్ సప్లయ్ డీటీ తిరుపతి, తదితరులున్నారు.

సొదాగర్ అరవింద్‌కు పార్టీతో సంబంధం లేదు



మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ జుక్కల్ ఎస్సీ సెల్ నాయకుడినని అంటూ తిరుగుతున్న సొదాగర్ అరవింద్‌కు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని.. ఆయనను ఆరేళ్ల పాటు పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిందని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. 2023లోనే సొదాగర్ అరవింద్ అనే వ్యక్తి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపాడని అన్నారు. రెండు రోజుల క్రితం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్వయంగా సొదాగర్ అరవింద్‌ను ఆరేళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారని ఆమె గుర్తు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, నాయకులు హన్మండ్లు స్వామి, ప్రజ్ఞ కుమార్, రమేశ్, రాములు, సాయిలు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన గజవాడ మహేష్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అందజేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు లబ్ధిదారుడికి రూ.43వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నగేష్, కొడ రవి, భాస్కర్‌గౌడ్, దూరిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యాట్ల పంపిణీ



కామారెడ్డి రూరల్: గర్గుల్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మన ఊరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సిట్టింగ్ మ్యాట్స్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతల రవితేజగౌడ్ రూ.3 వేలు, గడీల సుధాకర్ రూ.1,500, గడ్డం రాజ్‌కుమార్ రూ.1,500ల ఆర్థిక సహాయంతో ఈ సిట్టింగ్ మ్యాట్లు అందజేసినట్లు వారు తెలిపారు. మన ఊరు ఫౌండేషన్ అధ్యక్షుడు సున్నపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, కొలిమి సురేష్ రెడ్డి, సహాయ కార్యదర్శి యూనుస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగులు..

కామారెడ్డి రూరల్: అడ్లూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కామారెడ్డిలోని శ్రీలక్ష్మీ ఆస్పత్రి వైద్యుడు శ్రావణ్‌కుమార్ గురువారం గొడుగులను పంపిణీ చేశారు. హెచ్ఎం జి.బాలరాజ్, ఉపాధ్యాయుడు శ్యామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామాల్లో సౌకర్యాలు కరువు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్న వైనం



స్నానపు గదుల ముందు పెరిగిన పిచ్చి మొక్కలు



సదాశివనగర్ వైకుంఠధామంలో నీటి వసతి లేక నిరుపయోగంగా మారిన కుళాయిలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో గత ప్రభుత్వం వైకుంఠ ధామాలను నిర్మించింది. ఇందులోకి వెళ్లేందుకు ప్రవేశ ద్వారం, కార్యాలయం, మృతదేహాలను కాల్చేందుకు రెండు బర్నింగ్ పాయింట్స్, రెండు దిమ్మెలు, వెయిటింగ్ హాల్, రెండు మరుగుదొడ్లు నిర్మించారు. కానీ పంచాయతీలకు నిధులు రాక పోవడతంతో ఏ వైకుంఠధామంలో చూసినా పిచ్చి మొక్కలు పెరిగి పరిసరాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. మృతదేహాలను తీసుకెళ్లేందుకు మార్గం సరిగా లేకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఇబ్బందులు పడకతప్పడం లేదు. మరో వైపు చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. అక్కడ కనీసం నీరు, నీడ, విద్యుత్ సౌకర్యాలు లేవు. కాలువగట్లపై దహన సంస్కారాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈదురుగాలులకు పలు చోట్ల వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లపై వేసిన రేకులు ఎగిరిపోయాయి. మరికొన్ని చోట్ల కిటికీలు తలుపులు ధ్వంసమయ్యాయి.



వర్షపు నీటిలో మునిగిపోయిన సెప్టిక్ ట్యాంక్

పల్లపు ప్రాంతాల్లో నిర్మించడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అందులోకి వర్షపు నీరు వచ్చి చేరింది. మందుబాబులు వైకుంఠధామాలనే తమ అడ్డాలుగా చేసుకుని పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు.

నిర్వహణ భారంగా మారింది

వైకుంఠధామాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా చేయిస్తాం. వసతులు లేని చోట్ల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. సమస్యలను పరిష్కరిస్తాం.

– సంతోష్‌కుమార్, ఎంపీడీవో, సదాశివనగర్

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



బాన్సువాడ బస్టాండ్‌లో శుభ్రం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు



ఎల్లారెడ్డి బస్టాండ్‌లో ఊడుస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని గురువారం బాన్సువాడ బస్టాండ్‌లో బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ.. భారత దేశ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా పెంచిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ప్రధాన మంత్రి మోదీ నిండు నూరేళ్ల జీవించాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకులు కోనాల గంగారెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, చీదరి సాయిలు, శ్రీనివాస్, మజ్జిగ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి బస్టాండ్‌లో..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్‌ను ఊడ్చి శుభ్రం చేశారు. బీజేపీ నాయకులు రాజేష్, నక్క గంగాధర్, ఎస్ఎన్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు.



పాల్వంచ హనుమన్ ఆలయం వద్ద బీజేపీ నేతలు

హనుమాన్ ఆలయంలో..

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో గురువారం శ్రమదానం చేశారు. ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం శుభ్రం చేశారు. బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, మండలాధ్యక్షుడు అనిల్, ఓబీసీ జిల్లా కార్యదర్శి రాజలింగం, ఉప్పు లక్ష్మీపతి, సత్యం సురేష్‌రెడ్డి, రమేష్, దేవేందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



సౌత్ క్యాంపస్‌లో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు



పద్మాజీవాడిలోని శ్రీ సాయి విజ్ఞాన్ పాఠశాలలో..

భిక్కనూరు: స్థానిక తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతికి చిహ్నమని ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. బతుకమ్మ విశిష్టత గురించి అవగాహన కల్పించారు.

పద్మాజీవాడిలో..

సదాశివనగర్: పద్మాజీవాడిలోని శ్రీ సాయి విజ్ఞాన్ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, పీఈటీ రాం సింగ్, టీచర్లు, విద్యార్థినులు, తదితులున్నారు.

విధుల బహిష్కరణ



ఆందోళన చేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న వాటర్‌వర్క్స్ విభాగం కార్మికులు గురువారం కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. 15 మంది వాటర్‌వర్క్స్ విభాగపు కార్మికులను పారిశుద్ధ్య విభాగానికి మార్చడాన్ని నిరసిస్తూ ధర్నాకు దిగారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విధులకు వెళ్లకుండా ఆందోళన చేపట్టడంతో డీఈ హన్మంతరావు కార్యాలయానికి చేరుకుని కార్మికులతో మాట్లాడి నచ్చజెప్పారు. కార్మిక సంఘాల లీడర్ల పేరిట కొందరు పనులు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని డీఈ మండిపడ్డారు. ప్రతీ ఒక్కరు సమానంగా పనులు చేయాలని సూచించారు. సానిటేషన్ విభాగంలోకి కార్మికులను పంపమని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఏఈ శంకర్, కార్మికులున్నారు.

పాఠశాలకు స్టడీ డెస్కుల బహూకరణ



మాచారెడ్డి: పాల్వంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్(సికింద్రాబాద్), సన్‌రైజర్(సికింద్రాబాద్) సహకారంతో కామారెడ్డి రోటరీ క్లబ్ ప్రతినిధులు గురువారం 184 స్టడీ డెస్కులను అందజేశారు. డెస్కులు బహూకరించిన రోటరీ క్లబ్ వారిని డీఈవో రాజు అభినందించారు. రోటరీ డిప్యూటీ గవర్నర్ జైపాల్‌రెడ్డి, హెచ్ఎం గోవర్ధన్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి కృష్ణహరి, ఎంఈవో రాంమోహన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ప్రతిభ చాటిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావుపేట్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కృష్ణకర్ రావు ఢిల్లీలో ప్రతిభ కనబరిచాడు. ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ జనరల్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చార్జింగ్ కేబుల్స్, సోలార్ ప్యానల్స్, వ్యర్థ పదార్థాల నిర్వహణకు సంబంధించి వస్తువుల నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాల కంపెనీలు వాహనాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు ఏవిధంగా పాటిస్తారో తెలుసుకొని చర్చించారు. వీటి ద్వారా వినియోగదారులకు కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. వివిధ దేశాలలో నాణ్యతా ప్రమాణాలు ఏవిధంగా పాటిస్తారో విదేశీ ప్రతినిధులతో చర్చించి తెలుసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

షబ్బీర్ అలీకి ఆహ్వానం



దోమకొండ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. చాముండేశ్వరీ ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వెంకటేశం, రమేష్, బాల్‌రాజ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్, నాయకులు సీతారాం మధు, సంతోష్‌రెడ్డి, తదితరులు ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నవరాత్రి ఉత్సవాలకు హాజరవుతానని ఆయన పేర్కొన్నట్లు వారు వివరించారు.

నీటమునిగిన పంటలకు రూ.30 వేలు చెల్లించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో పంట నీటమునిగి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ నేతలు కోరారు. ఈ మేరకు నేతలు గురువారం డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మాల్తుమ్మెద, చీనూర్, వాడి, గోలిలింగాల, నాగిరెడ్డిపేట, బంజార, లింగంపల్లికలాన్, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి, ఆత్మకూర్, జలాల్‌పూర్ శివారుల్లో పంటలు వరదనీటిలో మంపునకు గురయ్యాయన్నారు. పంటలను అధికారులు స్వయంగా పరిశీలించి సర్వే చేయాలన్నారు. బీకేఎస్ మండలాధ్యక్షుడు కాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛతాహీ సేవ' పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జలాల్‌పూర్, మాటూర్, తాండూర్, మాసాన్‌పల్లి గ్రామాల్లో గురువారం చేపట్టిన స్వచ్ఛతాహీ సేవ పనులను స్థానిక ఎంపీడీవో లలితకుమారీ పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో పనులను చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆమె ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడ కూడా చెత్త ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతోపాటు గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఆమెవెంట ఎంపీవో ప్రభాకరచారి, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, రవీందర్, తిరుపతి, సుభాష్‌రెడ్డి ఉన్నారు.

అడవి పందుల స్వైర విహారం



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రాశి వనంలో అడవి పందులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాశి వనంలో పొదలు పెరిగిపోవడంతో అడవి పందులకు నిలయంగా మారిందని, రాశివనం పక్కనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంతో అక్కడి తిరిగే విద్యార్థులు అడవి పందులను చూసి భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. అటవీ శాఖ అధికారులు స్పందించి అడవిపందులను ఇక్కడి నుంచి తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'హలో లంబాడీ- చలో హైదరాబాద్' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎల్ఎస్‌వో నాయకులు



ఆరేపల్లి కేజీబీవీలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే హలో లంబడా-చలో హైదరాబాద్ లంబాడీల ఆత్మగౌరవ వేదిక కార్యక్రమ వాల్‌పోస్టర్లను లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్ఎస్‌వో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ.. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే సభకు జిల్లాలోని లంబాడీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు తిరుపతి, అరవింద్, సతీష్, గోపాల్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

'చలో హైదరాబాద్' వాల్‌పోస్టర్లు..

మాచారెడ్డి: కేజీబీవీలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు వేతనాల పెంపు, ఖాళీల భర్తీపై ఈ నెల 22న ప్రగతి శీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధిచిన వాల్‌పోస్టర్లను గురువారం పాల్వంచ మండలంలోని ఆరేపల్లి కేజీబీవీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియర్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. నాన్‌టీచింగ్ వర్కర్లకు కనీస వేతన చట్టం అమలు చేయాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

'కాచిగూడ మహాసభకే మున్నూరుకాపుల మద్దతు'



కామారెడ్డి అర్బన్: మున్నూరుకాపు సంఘంలో చీలిక ఏర్పడినందున హైదరాబాద్‌లోని కాచిగూడ మున్నూరుకాపు మహాసభకు మద్దతు ఇచ్చి అక్కడే సభ్యత్వం తీసుకోవాలని మున్నూరుకాపు జిల్లా సంఘం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్‌రావు పటేల్, పి.అంజయ్య పటేల్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం సంఘం సమావేశం జరిగింది. జిల్లాలో మున్నూరుకాపుల ఐక్యత కోసం సింహగర్జన సభ ఏర్పాటు, ప్రతి మండలంలో మహిళ, యువత కమిటీలను నియమించాలని తీర్మానించారు. నాయకులు కొమిరెడ్డి నారాయణ, కుంటి అంజనేయులు, ఈదులయ సాయిరెడ్డి, బాజ లలిత, సంకరి రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

మేదరి వృత్తి రక్షణకు చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి అర్బన్: మేదరి వృత్తి రక్షణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట మల్లికార్జున్, అధ్యక్షులు సాప శివరాములు కోరారు. ప్రపంచ మేదరి (మహేంద్ర) దినోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. సంఘం నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోనందున పాముల, మాలసింధు, సాధనసూరులు, చిలుక పంచాంగం చెప్పే కుల వృత్తులతో పాటు అనేక కులాల వృత్తుల వారు ఉపాధిలేక దీనస్థితిలో ఉన్నారని, వెదురు అల్లికలపై ఆధారపడిన మేదరి వృత్తి సైతం అంతరించిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు అర్నె కిషన్, జి.బాలరాజు, మత్రి గంగాధర్, ఇందూరి సంజీవ్‌లు తదితరులున్నారు.

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు



టేక్రియాల్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు



రాజంపేటలో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

సాక్షి నెట్‌వర్క్: స్వస్థ్ నారీ– స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గురువారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ శిబిరాలకు మహిళలు భారీగా తరలివచ్చారు. ఆరోగ్యంపై వైద్యులు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.



నాగిరెడ్డిపేటలో..

సంక్షిప్తం

పేద రైతులకు న్యాయం చేయాలి



గాంధారి(ఎల్లారెడ్డి): మాతుసంగెం శివారులో గల పేద రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఎల్లారెడ్డి నియోజకవర్గం కార్యదర్శి మోతీరాం నాయక్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మోతీరాం మాట్లాడుతూ.. మాతు సంగెం శివారులో ప్రభుత్వ భూములను పేద రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కాని కొందరు భూస్వాములు ఆ భూములను ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విచారణ చేసి పేద రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పీఎం ఆవాస్ యోజన ద్వారా రూ.72 వేల సాయం



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు కేంద్రం ప్రభుత్వం తన వంతుగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా రూ.72 వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. లబ్ధిదారులు ఈ సదుపాయం పొందడానికి ఆవాస్ ప్లస్ 2024 యాప్ ద్వారా తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల వద్దకు వెళ్లి సర్వే చేస్తున్నారు. ఇందిరమ్మ పథకంలో రూ.5 లక్షల్లో కేంద్ర ప్రభుత్వం రూ.72వేలు చెల్లిస్తుండగా మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



బాన్సువాడ రూరల్: శారీరక వికలాంగులైన విద్యార్థులకు ప్రతిరోజూ ఫిజియోథెరఫీ చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ భవిత కేంద్రం స్పెషల్ టీచర్ అందె అనిల్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి చేయించారు. ప్రతి గురువారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్‌పీ వెంకటపద్మ, ఫిజియోథెరపిస్టు గంగాధర్ పాల్గొన్నారు.